క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



గుంటూరు రూరల్: చిన్న పలకలూరు గ్రామం బీసీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులకు జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.11 లక్షలతో నూతన పైప్‌లైన్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, దాసరి నాగరాజు, ఎం.వెంకటేశ్వర్లు, గ్రామ సెక్రటరీ జోత్స్న నరేష్ తదితరులున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



కాకుమాను: విద్యతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక నన్నపనేని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని ఆరు పాఠశాలల విద్యార్థులకు రూ.10 వేల లెక్కన నగదు నగదు బహుమతులను జెడ్పీటీసీ అందజేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని గుల్జార్ బేగం కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముజావర్ షేక్ అసదుల్లా, ఎంపీడీఓ రామకృష్ణ, హెచ్‌ఎం, సత్యం, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మహా ప్రస్థానంలో.. యూపీకి భౌతికకాయం

గుంటూరు మెడికల్: అతను ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగి. స్వగ్రామం ఉత్తరప్రదేశ్‌లోని చికియా గ్రామం. బెంగళూరులో ఉద్యోగం చేస్తూ గర్భిణిగా ఉన్న భార్యతో రైలులో ప్రయాణిస్తుండగా తెనాలి సమీపంలో ఆమె ఆరోగ్యం విషమించడంతో అక్కడ ప్రాథమిక చికిత్స అందించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందిన ఆమె భౌతికాయాన్ని సుమారు 1500 కిలోమీటర్లు (రానుపోనూ 3000 కి.మీ) మహాప్రస్థానం వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్ అధికారులు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని చందోలిజిల్లా చికియాగ్రామానికి చెందిన జె.రంజిత్‌కుమార్ బెంగళూరులో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నాడు. అతనికి ఇరువురు సంతానం కాగా, భార్య విశ్వభారతి (31) మళ్లీ గర్భం ధరించింది. ఈనెల 13న స్వగ్రామం వెళ్లేందుకు బెంగళూరు నుంచి రైలులో కుటుంబంతో బయల్దేరారు. జిల్లాలోని తెనాలి రైల్వేస్టేషన్‌కు వారు ప్రయాణిస్తున్న రైలు చేరుకునేసరికి విశ్వభారతికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఈనెల 13వ తేదీన తక్షణమే తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి గర్భసంచి దెబ్బతిని తీవ్ర రక్తస్రావం అవుతుందని గుర్తించి, మెరుగైన చికిత్స కోసం అదేరోజు రాత్రి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్ వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలోనే తీవ్ర రక్తస్రావంతో విశ్వభారతి కోమాలోకి వెళ్లిపోయి సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆమె భౌతిక కాయాన్ని ఉత్తరప్రదేశ్‌లోని స్వగ్రామానికి చేర్చేందుకు డీఎంఈ, జిల్లా కలెక్టర్‌ల వద్ద ప్రత్యేక అనుమతి తీసుకుని మహాప్రస్థానం వాహనం ద్వారా ఉచితంగా పంపించారు. విశ్వభారతి మృతితో ఇరువురు చిన్నారులతో రంజిత్‌కుమార్ పడుతున్న అవస్థలు గమనించిన నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని చిన్నారులకు పాలు, ఆహార వసతి కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

గుంటూరు ఈస్ట్: నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ రెండో అంతస్తు నుంచి కిందపడ్డ కూలీ మృతిచెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన కూలీ విజయశేఖర్ (31) దేవాపురం 3వలైనులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో పని చేస్తూ.. ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి లిఫ్ట్ కోసం తవ్విన గుంతలోపడి తీవ్రంగా గాయపడ్డాడు. జీజీహెచ్‌కు తరలించగా.. అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


భరతమాత సంకెళ్లు తెంచిన..ఉద్యమ వనితలు

- చేబ్రోలు కేంద్రంగా స్వాతంత్య్రోద్యమాలు
- జాతిపితకు ఘనస్వాగతం పలికిన ఘనత
- స్వాతంత్య్ర పోరాటంలో ధీరత్వం చూపిన మహిళలు



సూర్యదేవర రాజ్యలక్ష్మి

చేబ్రోలు: భారత దేశ స్వాతంత్య్ర పోరాటంలో చేబ్రోలు కేంద్రంగా అనేక మంది మహిళలు, యువకులు పాల్గొన్నారు. తమ దేశ భక్తిని చాటుకున్నారు. జిల్లాలోనే చేబ్రోలు నుంచి అధిక సంఖ్యలో 48 మంది పాల్గొనగా వారిలో 25 మంది మహిళలే కావడం విశేషం. జిల్లాకు మొట్టమొదటి సారిగా వచ్చిన మహాత్మాగాంధీ గుంటూరు నుంచి బాపట్ల వెళుతూ మార్గ మధ్యలో చేబ్రోలులో బస చేసినట్లు చేశారు. నాటి గాంధీ ఆశ్రమంగా పిలువబడిన స్థావరం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. చేబ్రోలు నుంచి స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రముఖంగా సూర్యదేవర రాజ్యలక్ష్మి, వాసిరెడ్డి చంద్రశేఖరం, పాడిబండ్ల నాగేశ్వరావు, పార్వతమ్మ, గోళ్లమూడి రత్తమ్మ, అన్నపూర్ణమ్మ, బసవలింగయ్య, సైరా చిన్నప్పరెడ్డి, అఖిలాండేశ్వరి తదితరులు ఉన్నారు. స్వాతంత్య్ర సమర యోధుల పేర్లతో కూడిన శిలాఫలకం వారిని గుర్తు చేస్తుంది. ఈ శిలా ఫలకాన్ని మాజీ సర్పంచ్ గాదె వెంకటప్పారెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఇది నాటి చరిత్రను తెలియజేస్తుంది.



స్వాతంత్య్ర ఉద్యమంలో చరఖా పట్టిన చేబ్రోలు ధీర మహిళలు

స్వాతంత్య్ర పోరాటంలో మహిళామణులు

స్వాతంత్య్ర ఉద్యమంలో మహాత్ముని పిలుపు మేరకు చేబ్రోలులో స్త్రీలే ఎక్కువగా సత్యాగ్రహాలు చేసి జైలుకు వెళ్లారు. స్వాతంత్య్ర సమరంలో చైతన్యవంతమైన చేబ్రోలు మహిళలు అగ్రభాగాన నిలిచి పోరాడారు. మహిళలు బయటికి రావడమే అరుదైన ఆనాటి కాలంలో.. భరత మాత సంకెళ్లను తెంచేందుకు స్వాతంత్య్రోద్యమంలో పాల్గొని, తమ ధీరత్వాన్ని చూపారు. జైలుకు వెళ్లిన చేబ్రోలు మహిళల్లో ప్రముఖంగా రాజ్యలక్ష్మమ్మ, అఖిలాండేశ్వరి, అన్నపూర్ణమ్మ, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

ఉద్యమ వనిత..సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి

ప్రముఖ స్వాంతంత్య్ర సమర యోధురాలు, అండమాన్ వెళ్లి నేతాజీ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మహిళ సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి. ఈమె మహిళా ఉద్యమాలలో, ఖద్దరు ప్రచారంలో, మద్యపాన వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. కృష్ణాజిల్లా నందిగామ తాలుకా వీరుల పాడులో 1914, మే18న వాసిరెడ్డి సీతారామయ్య, సుబ్బమ్మ దంపతులకు రాజ్యలక్ష్మీదేవి జన్మించింది. చేబ్రోలుకు చెందిన సూర్యదేవర నాగయ్యతో పదేళ్ల వయస్సులో ఆమెకు వివాహం జరిగింది. మహాత్మా గాంధీ పిలుపుతో 1932లో శాసనోల్లంఘనం నాటికి అత్తగారింటికి చేబ్రోలు వచ్చారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనటంతో ఆమెను అరెస్ట్ చేశారు. రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జైలుకు తరలించారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ఆమె బ్రాహ్మణకోడూరులో సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జైలు శిక్ష, జరిమానా విధించారు. 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని ఆమె స్థాపించారు. అక్టోబర్ 2న 1945లో ఆంధ్రరాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. స్వాతంత్య్రం అనంతరం నైజాం వ్యతిరేక పోరాట నాయకులకు తమ సంఘీభావాన్ని తెలిపారు. నైజాం వెళ్లి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యలక్ష్మీదేవి 2010 ఆగస్టు 8న మరణించారు.



చేబ్రోలులో మహాత్మా గాంధీ బసచేసిన ఆశ్రమం శిథిలావస్థలో ఇలా..



స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న వారి వివరాలతో శిలాఫలకం

జీబీసీ రోడ్డు విస్తరణపై టీడీపీ దుష్ప్రచారం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు జీబీసీ రహదారి అభివృద్ధి, విస్తరణ పనులు ప్రారంభం అవటంతో టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరులోని జీబీసీ రహదారి విస్తరణ ప్రాంతంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రహదారి అభివృద్ధి, విస్తరణకు సహకరిస్తున్న భవన యజమానులను పక్కదోవ పట్టించడానికి టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. విస్తరణలో భాగంగా.. కూల్చివేసిన కట్టడాల మరమ్మతులకు పొన్నూరు భవన యజమానులకు రూ.3.82 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గత ఐదు పర్యాయాలుగా పట్టణ ప్రజలను మభ్యపెడుతూ అభివృద్ధిని ఆటంక పరుస్తూ.. ఎన్నికల ముందు చందాలు వసూలు చేయడం టీడీపీ నేతలకు ఆనవాయితీగా మారిందన్నారు. టీడీపీకి రానున్న కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, స్టేట్ ఇరిగేషన్ బోర్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ దాసరి నారాయణ రావు, బొద్దులూరి రంగారావు, ఆకుల రామ్మోహన్, భవనం వంశీ రెడ్డి, వట్టిప్రోలు రంగారావు, కొల్లేరు శ్రీనివాసరావు, రుద్రపాటి ఆదిశేషు, ఎం.అనిలాకుమారి, షేక్ షర్మిల, గేరా కుమారి, షేక్ మాము, మోపర్తి ప్రమీల, గూడవల్లి గంగాధర్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

నాణ్యమైన దిగుబడితో పంటకు అధిక ధర

హార్టికల్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఎస్ ధర్మజ

గుంటూరు రూరల్: రైతులు పంట కోత అనంతరం మెళకువలు తప్పనిసరిగా పాటించాలని హార్టికల్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన రైతు శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆశాజనకమైన ధరలకు విక్రయించాలంటే.. నాణ్యమైన పంట దిగుబడి రావాలని తెలిపారు. జామ, మామిడి లాంటి పండ్లకు కవర్లు తొడిగినట్లయితే పండ్లపై చీడపీడల ప్రభావం తగ్గుతుందన్నారు. మిరప పంటను సిమెంటు ఫ్లోరింగ్ మీద ఎండబెడితే నాణ్యత పొందవచ్చన్నారు. రైతులకు నాబార్డు అందించే సేవలను నాబార్డు జిల్లా మేనేజరు శరత్ వివరించారు. సాగులో డ్రోన్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి, వివరించారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. సేంద్రియ రైతులు శబరీనాథ్, ఏడుకొండలు, శరత్ తదితరులున్నారు.



సాగులో డ్రోన్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన

జొన్నలగడ్డలో 'నా భూమి – నా దేశం'

గుంటూరు రూరల్: ఎందరో త్యాగధనుల ప్రాణ త్యాగం నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రమని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు అన్నారు. జొన్నలగడ్డ గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్, నా భూమి – నా దేశం కార్యక్రమం ఆయన నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. నా మట్టి నాభూమి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, సుధాకర్, వంగా నవీన్‌రెడ్డి, రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో..

సుద్దపల్లి(చేబ్రోలు): నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అంటూ చేబ్రోలు మండలం సుద్దపల్లి, మంచాల గ్రామాల్లో సోమవారం నా భూమి – నా దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.అనూరాధ పాల్గొన్నారు. మంచాలలో జరిగిన కార్యక్రమంలో దేశానికి సేవలు అందించిన ఆర్మీ ఉద్యోగులను సన్మానించారు. ఆయా చోట్ల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో 75 మొక్కలు నాటారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల



సుద్దపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.అనూరాధ

మహిళా పాలిటెక్నిక్ డీ ఫార్మసీలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ ఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, దూరవిద్య ఇంటర్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటో, సామాజికవర్గ ధృవీకరణ, టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాతో కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కలదని, డీ.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థినులకు ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసీలలో ఉపాధి అవకాశాలతో పాటు స్వయం ఉపాధిగా మందులు షాపు నిర్వహించుకోవచ్చునని పేర్కొన్నారు. డీ.ఫార్మసీ పూర్తి చేసిన తరువాత ఈ–సెట్ ద్వారా బీ.ఫార్మసీ ద్వితీయ సంవత్సరంలోకి నేరుగా ప్రవేశం లభిస్తుందని, వివరాలకు కళాశాల ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ పి.నిర్మలా దేవిని 9959324563, 9848038769 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ++ అక్రిడిటేషన్

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ++ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గ్రేడ్ సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ నాక్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మొదటి సైకిల్‌లోనే విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ++ అక్రిడిటేషన్ ఐదేళ్లపాటు (2023–2028) పాటు లభించిందని తెలిపారు. స్టూడెంట్స్ సపోర్ట్ అండ్ ప్రోగ్రెస్సన్, గవర్నెన్స్, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూషన్ వాల్యూస్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్‌లలో ప్రతిభ చూపిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. నాక్ ఏ++ అక్రిడిటేషన్ ఉండటం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో స్థానం లభిస్తుందన్నారు. వైస్ చాన్స్‌లర్ పీనాగభూషణ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

150 మీటర్ల జెండాతో ఏబీవీపీ తిరంగా ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో 150 మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద జాతీయ జెండాతో కూడిన విద్యార్థుల ప్రదర్శనను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ప్రారంభించారు.
ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమన్నారు. విద్యార్థులు, యువతరం నిత్యం వారిని స్మరించుకుంటూ దేశభక్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. దేశభక్తిని నింపేందుకు ఏబీవీపీ జాతీయ జెండాతో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాతో లాడ్జి సెంటర్ వరకు ప్రదర్శనగా తరలివెళ్లారు.. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి డి.సాయి చరణ్‌గుప్తా, సంయుక్త కార్యదర్శి ఎస్.చంద్ర, జిల్లా కన్వీనర్ దివాకర్, కార్యకర్తలతో పాటు వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒక ఏకగ్రీవం.. రెండు పోటీ

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని మూడు పంచాయతీ వార్డుల ఉప ఎన్నిక నేపథ్యంలో ఒకటి ఏకగ్రీవం కాగా, మిగిలిన రెండు చోట్లా ఈ నెల 19న ఎన్నికలు జరుగుతాయని స్టేజ్–1 ఎన్నికల అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. శలపాడు –1 వార్డుకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మొగిలిపాలెం రాంబాబు ఒక్క నామినేషన్ మిగలటంతో ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. తోట్లపాలెం –1 వా ర్డు మెంబరు ఉప ఎన్నికకు నామినేషన్ల ఉప సంహరణ అనంతరం కఠివరపు మీనా, జి.శివపా ర్వతి ఇరువురు పోటీలో ఉండటంతో 19న ఎన్నిక జరగనున్నది. గుండవరం–3వ వార్డుకు నామినేషన్ల ఉప సంహరణ అనంతరం గుంటూరు బాజి, జి.శివకుమార్ ఉండటంతో పోటీ అనివార్యమైంది. ఈ నెల 19న ఎన్నిక జరగనున్నది.

సత్తాచాటిని వీవీఐటీ మెకానికల్ విద్యార్థులు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని మెకానికల్ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యూందాయ్‌లో ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరులోని కళాశాలలో సోమవారం చైర్మన్ మాట్లాడుతూ మెకానికల్ విభాగం నాల్గవ సంవత్సరానికి చెందిన విద్యార్థులు బొర్ర జగదీష్, చేజర్ల గణేష్ వెంకటసాయి, నిఖిల్ ఎజ్జు ఉద్యోగ నియామకాలు పొందారని తెలిపారు. చెన్నైలోని హ్యూందాయ్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ కార్యాలయంలో విద్యార్థులు రూ.6,80,000ల వార్షిక వేతనంతో గతవారం నియామక పత్రాలు అందుకున్నారని తెలిపారు. ఈ విద్యాసంవత్సరము నందు మెకానికల్ విభాగానికి చెందిన 72 మంది విద్యార్థులు వివిధ బహుళజాతి సంస్థల్లో నియామకాలు పొందారన్నారు. నియామకాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరావు, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, డీన్ డాక్టర్ సత్యన్నారాయణ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఆస్తి గొడవల నేపథ్యంలో ఇంటికి నిప్పు

గుంటూరు ఈస్ట్: ఆస్తి గొడవల నేపథ్యంలో కోడలి ఇంటికి నిప్పుపెట్టిన మామపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకుమానువారితోటలో నివాసం ఉండే పుష్పకు, ఆమె చిన్నమామ మేకపాటి నరసింహారావుల మధ్య ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో నరసింహారావు ఆదివారం రాత్రి పుష్ప ఇంట్లోకి వెళ్లాడు. పుష్ప వెనుక గదిలో నిద్రిస్తుండగా, ముందు గదిలోని బెడ్‌పై నరసింహారావు పెట్రోలు పెట్టి నిప్పంటించాడు. పొగ వాసనకు నిద్రమేల్కొన్న పుష్ప పక్కింటివారి సహాయంతో మంటలు ఆర్పించారు. పుష్ప ఇంట్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నరసింహారావు నిప్పు పెట్టినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.